## క్లుప్తంగా

### ఘనంగా చండీ హోమం



వీరేశ్వరస్వామి ఆలయంలో చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి తిథిని పురస్కరించుకొని భద్రకాళి అమ్మవారికి చండీ హోమం నిర్వహించారు. ఆలయ అర్చకస్వామి పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో అమ్మవారికి గణపతి పూజ, చండీ పారాయణ, చండీ హోమం సోమవారం జరిపారు. గురుపూజా దినోత్సవం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు వచ్చి చండీ హోమం తిలకించి ప్రసాదాలు స్వీకరించారు.

### బాధితులకు న్యాయం చేయాలి

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ 20వ వార్డు కంసాలగరువులో ఆక్రమణల తొలగింపులో ఇళ్లు కోల్పోయిన బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ టీడీపీ నాయకులు నగర పంచాయతీ కార్యాలయం ఎదుట బాధితులతో కలిసి సోమవారం ధర్నా నిర్వహించారు. ఇళ్లు కోల్పోయిన స్థలాల్లోనే బాధితులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కమిషనర్ జి.లోవరాజుకు అందజేశారు. ధర్నాలో చెల్లి అశోక్, పొద్దోకు నారాయణరావు, దొమ్మేటి రమణకుమార్, నడింపల్లి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

### వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కృషి



చల్లపల్లిలో కరపత్రాలను పంచుతున్న నల్లా పవన్‌కుమార్

ఉప్పలగుప్తం: దేశంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తుందని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లా పవన్‌కుమార్ అన్నారు. బీజేపీ మహాజన్ గృహ సంపర్క్ అభియాన్‌లో భాగంగా మండలంలోని చల్లపల్లి గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆకుల జగ్గయ్యనాయుడు అధ్యక్షతన తొమ్మిదేళ్ల మోదీ సుపరిపాలన వివరాలను కరపత్రాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమాన్ని సోమవారం పార్టీ నేతలు నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యాల భాస్కరరావు, గనిశెట్టి అరవింద్, దాకే వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు పనులకు శంకుస్థాపన



రోడ్డు పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో ఎంపీపీ, సర్పంచ్ తదితరులు

అమలాపురం రూరల్: పేరూరు కొంకాపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు, పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించనున్న రోడ్డు పనులకు ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, సర్పంచ్ దాసరి అరుణలు సోమవారం శంకుస్థాపన చేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, ఎంపీటీసీ సభ్యులు చొల్లంగి సుబ్బిరామ్, వాసంశెట్టి శ్రీనివాస్, వైఎస్సార్ రూరల్ కార్యదర్శి గణపతి, కాసర రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధి కూలీలపై కందిరీగల దాడి



పీహెచ్‌సీలో బాధితులను పరామర్శిస్తున్న ఏపీవో రాజామణి తదితరులు

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.యానాంలోని పంట కాలువలో పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి కూలీలపై కందిరీగలు దాడి చేయడంతో 15 మంది గాయపడ్డారు. ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ చీకట్ల సుబ్బారావు గాయపడిన కూలీలను గ్రామంలోని పీహెచ్‌సీకి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. గాయపడిన కూలీలను ఉపాధి ఏపీవో వి.రాజామణి, ఎంపీటీసీ సభ్యుడు పెట్టా అప్పారావు, వార్డు మెంబర్ బడుగు అబ్బులు పరామర్శించారు.

### క్యారమ్స్ అంపైర్ పరీక్షలో ఎంపికైన పీఈటీలు

యానాం: పుదుచ్చేరి అమెచ్యూర్ క్యారమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యారమ్స్ క్రీడకు సంబంధించి నిర్వహించిన అంపైర్ పరీక్షలో యానాంకు చెందిన సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు చింతం రామకృష్ణ, ఇందుగుల వెంకటకృష్ణమోహన్‌లు ఎంపికయ్యారు. సంబంధిత పరీక్షలో పాసైనట్లు సోమవారం సర్టిఫికెట్లు వచ్చాయని వారిద్దరూ తెలిపారు. ఇక నుంచి జరగబోయే స్టేట్ క్యారమ్స్ టోర్నమెంట్లకు తాము అంపైర్‌లుగా ప్రాతినిధ్యం వహిస్తామన్నారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం సభ్యులు వారిద్దరినీ అభినందించారు.

# అభాగ్యులకు అండగా...సేవలు మెండుగా..

- ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నింపుతున్న రిలయన్స్ దివ్యాంగుల కేంద్రం
- నిరంతర సేవలతో ప్రజల మన్ననలు



సీతారామపురం రిలయన్స్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్‌లో మానసిక దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణనిస్తున్న సిబ్బంది

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ సీతారామపురంలో ఉన్న ధీరూబాయి అంబానీ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్ అనేకమందికి సేవలందిస్తూ అభాగ్యులకు అండగా నిలుస్తుంది. ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా అందించడం, మానసిక వికలాంగులను అక్కున చేర్చుకుని వారిని సకలాంగులుగా తీర్చిదిద్దడం తదితర నిరంతర సేవలతో ప్రజల మన్ననలు చూరగొంటుంది. తాళ్లరేవు పరిసర ప్రాంతాల నుంచే కాక జిల్లా నలుమూలల నుంచి అనేకమంది ఇక్కడకు వచ్చి సాంత్వన పొందుతున్నారు.

**పుష్కర కాలంగా నిరంతర సేవలు**

2009లో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆర్థిక సాయంతో రిలయన్స్ ధీరూబాయి అంబానీ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ పేరిట సేవలను ప్రారంభించారు. ఉమా మనోవికాస కేంద్రం సహకారంతో దివ్యాంగుల పాఠశాలతో పాటు అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ నిరుపేదలకు కొండంత అండగా నిలుస్తున్నారు. 2017 వరకూ అద్దె భవనంలో కొనసాగిన సేవలు ఐదేళ్ల క్రితం సొంత భవనంలోకి మారాయి. ప్రధానంగా తాళ్లరేవు పరిసర ప్రాంతాలకు చెందిన మానసిక దివ్యాంగులను గుర్తించి వారిని సాధారణమైన పిల్లలుగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు శ్రమిస్తుంటారు. వారిలో మార్పు తీసుకురావడంతో పాటు వారికి ప్రత్యేకమైన విద్యనందించి సమాజంలో ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దుతున్నారు. ఇటీవల కాలంలో అధిక శాతం మంది కాళ్లు, చేతులు, మెడ తదితర నొప్పులతో బాధపడడం చూస్తున్నాం. వీటికి ప్రధానంగా మందులతో పాటు ఫిజియోథెరపీ చేయిస్తేనే శాశ్వతంగా నయమవుతుందని వైద్యులు చెబుతుంటారు. అయితే ప్రముఖ నగరాల్లో మాత్రమే ఫిజియోథెరపీ సేవలు అందుబాటులో ఉంటుంటాయి. పైగా ఎంతో ఖరీదైన ఫిజియోథెరపీ వైద్యం చేయించుకోలేక బాధపడుతున్నవారికి ఈ కేంద్రంలో ఎటువంటి రుసుము తీసుకోకుండా ఉచితంగా ఫిజియోథెరపీ సేవలు అందించడం విశేషం. వివిధ రకాలైన నొప్పులతో బాధపడుతూ ఈ కేంద్రానికి వచ్చేవారిని తిరిగి మామూలు వ్యక్తులుగా మార్చి పంపిస్తుంటారు. ధనిక, పేద తేడా లేకుండా వైద్యం కోసం వచ్చిన వారందరికీ సేవలందించడం ఈ కేంద్రం ప్రత్యేకత. దీంతో ఈ కేంద్రం ఫిజియోథెరపీకి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. అలాగే స్పీచ్‌థెరపీ, మ్యూజిక్ అండ్ యోగా థెరపీ, ఒకేషనల్ ట్రైనింగ్ తదితర సేవలను అందిస్తున్నారు. గత 13 ఏళ్లుగా నిరాటంకంగా సేవలు కొనసాగుతున్నాయి.

**మరిన్ని సేవలు విస్తరిస్తాం**



కేంద్రం ద్వారా మానసిక దివ్యాంగులకు విశేష సేవలందిస్తున్నాం. మా సిబ్బంది ఎంతో నిబద్ధతతో పనిచేస్తారు. ఈ కేంద్రం ద్వారా భవిష్యత్తులో మరిన్ని సేవలు అందించడానికి చర్యలు చేపట్టాం. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి మానసిక దివ్యాంగులు ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవొచ్చు. – సుబ్రహ్మణ్యం, రిలయన్స్ ప్రతినిధి

**మానసిక దివ్యాంగులకు వరం**



మేనరిక వివాహాలు, పౌష్టికాహార లోపం తదితర కారణాలతో కొంతమంది పిల్లలు మానసిక దివ్యాంగులుగా మారుతున్నారు. అటువంటి వారిని గుర్తించి వారికి నిపుణులైన ఉపాధ్యాయులతో ఉచితంగా కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు ఉచిత విద్య, ఉచిత భోజనం, రవాణా తదితర సౌకర్యాలు కల్పిస్తున్నాం.

– ఎంపీ గోపాల్, రిలయన్స్ దివ్యాంగుల కేంద్రం ఇంచార్జ్

## కామాక్షీ పీఠంలో గురు పూజోత్సవం



పీఠాధిపతి కామేశ మహర్షికి గురుపూజ చేసి సత్కరిస్తున్న శిష్య, భక్త బృందం

అమలాపురం టౌన్: స్థానిక కామాక్షీ పీఠంలో గురు పూజోత్సవాలు సోమవారం వైభవంగా జరిగాయి. పీఠం బాల బ్రహ్మచారి విఘనస రాఖీ ప్రేమ్ ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ గోవిందర్షుల నాగబాబు పర్యవేక్షణలో పీఠాధిపతి కామేశ మహర్షికి గురు పూజ జరిగింది. ఆది శంకరాచార్య నుంచి నేటి శంకర విజయేంద్ర సరస్వతి మహా స్వామి వరకూ కంచి కామకోటి సర్వజ్ఞ పీఠాధిపతులుగా వచ్చిన గురు పరంపరతో అందర్నీ ఆవాహన చేసి శంకరాచార్య నామాలతో అర్చన చేశారు. పీఠాధిపతి కామేశ మహర్షి మాట్లాడుతూ గురువులపై భక్తిని చాటుకునేందుకు ఏర్పడిన మహా పర్వదినమే గురు పూర్ణిమ అని ఉద్బోధించారు. భక్తులు పీఠాధిపతి కామేశ మహర్షిని సత్కరించారు.

## వారాహి అమ్మవారికి పూజలు



వారాహి దేవతకు గుమ్మడి కాయలతో పూజలు చేస్తున్న అక్షయ పాత్ర ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక విద్యుత్ నగర్‌లోని ఆదిశేష నిలయంలో శ్రీగౌతమ మహర్షి అక్షయ పాత్ర ఆధ్వర్యంలో జరుగుతున్న వారాహి షోడశ రాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారికి సోమవారం గుమ్మడి, బూడిద గుమ్మడి కాయలతో అభిషేకం, పూజలు నిర్వహించారు. అనంతరం గుమ్మడి కాయలను నరికే కూష్మాండ బలిదానం సమర్పించారు. షోడశ రాత్రి మహోత్సవాలు మంగళవారం సాయంత్రం ఆరు గంటల నుంచి మహా పూర్ణాహుతితో మొదలై అర్ధరాత్రి దాటిన తర్వాత ముగుస్తాయని అక్షయ పాత్ర నిర్వాహకుడు పోతురాజు రామకృష్ణారావు తెలిపారు. అక్షయ పాత్ర సేవకులు అరిగెల బుజ్జి, లింగోలు విస్సు, తూము దొరబాబు, గొవ్వాల అచ్యుతరామయ్య తదితరులు పాల్గొన్నారు.

## మునికుమారికి ఎంపీల పరామర్శ



మునికుమారి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బోస్, చింతా అనురాధ

ముమ్మిడివరం: సోదర వియోగంతో బాధపడుతున్న హితకారిణి సమాజ్ ట్రస్ట్ చైర్మన్ కాశి బాల మునికుమారిని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, అమలాపురం ఎంపీ చింతా అనురాధలు సోమవారం పరామర్శించారు. మునికుమారి సోదరుడు కటికదల భరణికుమార్ ప్రమాదవశాత్తూ గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇటీవల మరణించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ బాలయోగి తపో ఆశ్రమ వెనుక వీధిలో ఉన్న భరణికుమార్ స్వగృహంలో మునికుమారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ముమ్మిడివరం జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, బొంతు సత్యశ్రీనివాస్, పిన్నమరాజు వెంకటపతిరాజు పరామర్శించిన వారిలో ఉన్నారు.

## విద్యార్థి దశలోనే భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ వేలాయుధం, చిత్రంలో భాస్కరరెడ్డి

యానాం: విద్యార్థి దశ నుంచే భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రథమ సంవత్సరం ప్రారంభోత్సవ సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువుతో పాటు మంచి పుస్తకాలను చదవాలని సూచించారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వేలాయుధం మాట్లాడుతూ చదువు ఆయుధం వంటిందని చదువు విషయంలో అశ్రద్ధ తగదన్నారు. అనంతరం ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజు, అమీరాబేగం, మట్టపర్తి మణికంఠ, జ్ఞానివీరేంద్రనాథ్, ఎన్ఎస్ఎస్ అధికారి జయవీరన్, సూపరింటెండెంట్ సాధనాల బాబు తదితరులు పాల్గొన్నారు.

## బుద్ధిజంతో శాంతియుత జీవనం



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు

అమలాపురం రూరల్: నేటి సమాజంలో ప్రతిఒక్కరూ బుద్ధిజాన్ని ఆచరించడం ద్వారా శాంతియుత జీవనాన్ని గడపొచ్చని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. అమలాపురం త్రిరత్న బుద్ధ విహార్‌లో ధమ్మ చక్ర పరివర్తన దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేల సంవత్సరాల క్రితం బౌద్ధ మతాన్ని నమ్ముకుని ఉన్నతంగా జీవించారన్నారు. మానవాళి మత విద్వేషాలు, విభేదాలు లేకుండా జీవించాలన్న ఉద్దేశంతోనే బుద్ధిజాన్ని తీసుకొచ్చారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్, త్రిరత్న బుద్ధ విహార్ రూపశిల్పి గొల్లపల్లి సూర్యారావు, అధ్యక్షుడు నాగాబత్తుల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి డీబీ లోక్, డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు, డీఎస్పీ అంబికా ప్రసాద్ పాల్గొన్నారు.

## సమన్వయంతో పనిచేయాలి

కాట్రేనికోన: అభివృద్ధే ధ్యేయంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని వైస్ ఎంపీపీ సానబోయిన నాగేశ్వరరావు అన్నారు. సోమవారం కాట్రేనికోన మండల పరిషత్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో కాట్రేనికోన పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది పనితీరు, సమయ పాలనపై సర్పంచ్ గంటి వెంకట సుధాకర్ నిలదీశారు. కబ్జాదారుల నుంచి శ్మశాన వాటిక భూమిని రక్షించాలని ఉప్పూడి సర్పంచ్ రంబాల రమేష్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నేల కిషోర్, ఏఎంసీ వైస్ చైర్మన్ కాశి హనుమంతరావు, సెంట్రల్ డెల్టా చైర్మన్ ఏడిది చక్రపాణిరావు, సంసాని నాగేశ్వరరావు, ఎంపీటీసీలు గుణవీణకుమార్, మోకా చంద్రనాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

## అందరికీ లబ్ధి చేకూర్చడమే 'సురక్ష' లక్ష్యం



బండారులంకలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న మంత్రి విశ్వరూప్



ధ్రువీకరణ పత్రాన్ని లబ్ధిదారులకు అందిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు

అమలాపురం రూరల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. సోమవారం బండారులంకలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జగనన్న సురక్ష పేరుతో 11 రకాల పౌర సేవలు ఉచితంగా పొందేందుకు వీలుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సువర్ణ అవకాశాన్ని కల్పించారన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అర్హులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, సర్పంచ్ పెనుమల సునీత, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, ఉపసర్పంచ్ కామిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: సమాజంలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాల లబ్ధిని అందించడమే జగనన్న సురక్ష పథకం లక్ష్యమని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. అమలాపురం పట్టణం 5వ వార్డులో సోమవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో కలెక్టర్ శుక్లా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎక్కడైనా సాంకేతిక లేదా మరే ఇతర కారణాల వల్ల ప్రభుత్వం నుంచి పొందాల్సిన సేవలు ఆగిపోతే వాటిని జగనన్న సురక్ష ద్వారా పొందే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందని చెప్పారు. ఈ సందర్భంగా

**రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్**

అర్హులకు పలు సేవలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, వార్డు కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు, పిండి రాజా ప్రసంగించారు. అశోక్‌నగర్ వార్డు సచివాలయంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తిక్కిరెడ్డి వెంకటేష్ లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

**ఇంజరంలో జగనన్న సురక్ష**

తాళ్లరేవు: అర్హులైన పేదలందరికీ నూరు శాతం పథకాలు అందించాలన్న లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష పథకాన్ని అమలు చేస్తున్నారని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. సోమవారం ఇంజరం పంచాయతీలో సర్పంచ్ ముద్దన వెంకట శివరామ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం ద్వారా రూపాయి ఖర్చులేకుండా, తిరిగే శ్రమ లేకుండా అధికారులే మీ వద్దకు వచ్చి సర్టిఫికెట్‌లను అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, మాజీ జెడ్పీ చైర్మన్ దున్నా జనార్దనరావు, ఎంపీటీసీ సభ్యురాలు కోరుకొండ కిరణ్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మెకానిక్స్ డే



మెకానిక్స్ డే వేడుకలు జరుపుకుంటున్న మోటారు సైకిల్ మెకానికర్లు

అమలాపురం టౌన్: స్థానిక సిద్ధి వినాయక మోటారు సైకిల్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరులో టూ వీలర్స్ మెకానిక్స్ డే వేడుకలు సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు సాధనాల సత్తిబాబు ఆధ్వర్యంలో మెకానికర్లు కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. మెకానికర్లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రూ.50 ఏళ్ల వయసు దాటిన మెకానిక్‌లకు నెలా నెలా రూ.5 వేల పింఛన్ సౌకర్యం కల్పించాలని వారు కోరారు. మెకానికర్లకు ప్రమాద, ఆరోగ్య బీమా కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు సత్తిబాబు, ప్రతినిధులు కాంద్రేగుల కృష్ణ, పట్నాల రమణ, నల్లా శ్రీను, మట్టా భాస్కరరావులు జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్ హిమాన్షుశుక్లాకు వినతి పత్రం అందజేశారు.

## భక్తులతో పోటెత్తిన సాయి ఆలయాలు



అమలాపురం స్వర్ణ శిఖర సాయి మందిరంలో అభిషేకాలు చేస్తున్న భక్తులు



బాబాకు పువ్వులతో అభిషేకం చేస్తున్న నానిరాజు దంపతులు

**ఘనంగా గురు పౌర్ణమి ఉత్సవాలు**

అమలాపురం టౌన్: గురు పౌర్ణమి సందర్భంగా నియోజకవర్గంలోని అమలాపురం పట్టణంతో పాటు 60 గ్రామాల్లో ఉన్న 79 షిర్డీ సాయి ఆలయాల్లో సోమవారం భక్తులు పోటెత్తారు. ముఖ్యంగా అమలాపురం పట్టణంలోని స్వర్ణ శిఖర షిర్డీ సాయి మందిరానికి సోమవారం ఉదయం నుంచి భక్తులు క్యూ కట్టారు. బాబాను క్షీరాభిషేకంతో పాటు పలు పండ్ల రసాలతో అభిషేకించారు. ఆలయ నిర్మాత మేడిచర్ల సాయిరామ్ ఆధ్వర్యంలో సాయి సేవకులు భక్తులకు సేవలందించారు. మధ్యాహ్నం జరిగిన అన్న సమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. స్థానిక శివాలయం వీధిలోని సర్వ మంగళ రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గురు పూజోత్సవాలు ఘనంగా జరిగాయి.

**ఘనంగా గురు పౌర్ణమి**

అల్లవరం: మండలంలోని కొమరగిరిపట్నంలో కొలువైన షిరిడీ సాయి ఆలయంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు దంపతులు సాయినాథునికి పువ్వులు, పాలతో అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు జరిపారు. గురుపౌర్ణమి పురస్కరించుకుని వందలాది మంది భక్తులు సాయి బాబాను దర్శించుకున్నారు.

ఉప్పలగుప్తం: గురుపౌర్ణమి సందర్భంగా మండలంలోని చల్లపల్లి, గొల్లవిల్లి, విలసవిల్లి గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చల్లపల్లిలోని బాబా ఆలయంలో ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకి, రాంబాబు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన చేశారు. గ్రామ దేవతలైన ముక్కులమ్మ, కుంకులమ్మ అమ్మవార్ల ఆలయంలో పండితుడు మున్నంగి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో చండీ హోమం నిర్వహించారు.

### నాటా కవితల పోటీల్లో దాట్లకు బహుమతి



యానాం: నార్త్ అమెరికన్ తెలుగు అసోసియేషన్(నాటా) ఉత్తర అమెరికా తెలుగు సమితి ఆధ్వర్యంలో నాటా సాహిత్యవేదిక నిర్వహించిన ప్రపంచ స్థాయి కవితల పోటీల్లో యానాంకు చెందిన ప్రముఖ కవి, కలైమామాణి దాట్ల దేవదానంరాజుకు బహుమతి లభించింది. ఈ మేరకు ఆయన రచించిన 'నది చెప్పిన పాఠం' కవితకు బహుమతి లభించిందని నాటా సాహిత్య వేదిక విభాగం సమన్వయకర్త డాక్టర్ ఊరిమిండి నరసింహారెడ్డి, ఎగ్జిక్యూటివ్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌రెడ్డిల నుంచి సోమవారం లేఖ తనకు అందిందని దాట్ల దేవదానం రాజు తెలిపారు. పోటీ పరిశీలనకు వెళ్లిన వేలాది కవితల్లో అయిదు ఉత్తమ కవితలకు వంద డాలర్ల చొప్పున నగదు అందజేస్తారని చెప్పారు. ఈ సందర్భంగా దేవదానం రాజును పలువురు అభినందించారు.

### ఎమ్మెల్యే పొన్నాడ పరామర్శ



త్రినాథ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

తాళ్లరేవు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కాపవరపు శ్రీదేవి కుమారుడు త్రినాథ్‌ను ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఆదివారం రాత్రి పరామర్శించారు. చొల్లంగిలోని కాపవరపు శ్రీదేవి స్వగృహానికి వెళ్లి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించిన శ్రీదేవిని దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ రాయుడు సునీత, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, స్థానిక నాయకులు బూరెల వెంకట్రాజు, వారా సూర్యకుమారి, వెంకన్న, ప్రసన్న, మోహన్ తదితరులున్నారు.

### వైభవంగా పోలేరమ్మ తీర్థ మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ అమ్మవారు

తాళ్లరేవు: పోలేకుర్రు గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం వైభవంగా జరిగింది. అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు సమర్పించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందజేశారు.

### పాఠశాలలకు కంప్యూటర్ల అందజేత



ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్లను అందజేస్తున్న రిలయన్స్ ప్రతినిధి సుబ్రహ్మణ్యం

తాళ్లరేవు: మండల పరిధిలోని మత్స్యకార గ్రామాలైన గాడిమొగ, భైరవపాలెం పంచాయతీల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు రిలయన్స్ సంస్థ తరఫున 23 కంప్యూటర్‌లను బహూకరించారు. సీతారామపురంలో ఉన్న దివ్యాంగుల కేంద్రంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు రిలయన్స్ ఇండస్ట్రీస్ ప్రాజెక్టు మేనేజర్ సుబ్రహ్మణ్యం కంప్యూటర్లను అందజేశారు.

### ముత్యాలమ్మకు క్షీరాభిషేకం



ముత్యాలమ్మకు పూజలు చేస్తున్న అర్చకులు

తాళ్లరేవు: పవిత్ర ఆషాఢమాసం గురు పౌర్ణమి పర్వదినం సందర్భంగా పి.మల్లవరం గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారికి సోమవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు ఖండవిల్లి శ్రీరంగాచార్యులు అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు విళ్ల సత్యనారాయణ, విళ్ల వీర, ఉంగరాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.